క్లుప్తంగా

చౌక్‌బాల్ పోటీలకు ఎంపిక

కొత్తూరు: పట్టణంలోని లిటిల్ ఎంజిల్స్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయస్థాయి చౌక్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికై నట్లు వివరించారు. ఈ నెల 26 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా మల్లన్న బోనాలు



బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన చాకలిగూడలో రెండురోజుల పాటు మల్లన్న బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మల్లన్న కల్యాణ మహోత్సవంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాలతో గ్రామంలో సందడి నెలకొంది.

పరిమితికి మించి తరలించొద్దు

ఎస్‌ఐ రవీందర్‌నాయక్



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవీందర్‌నాయక్

కొందుర్గు: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ సూచించారు. సోమవారం ప్రైవేట్ వాహనాల డ్రైవర్లకు సమావేశం నిర్వహించి పలు సూచనలు అందించారు. వాహనాలకు ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ వంటి సరైన ధ్రువపత్రాలు ఉండాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దని, మహిళలు, ప్రయాణికులను సురక్షితంగా ఇంటికి చేర్చాలని, ఎవరైనా డబ్బులు, ముఖ్యమైన వస్తువులు వాహనాల్లో వదిలివెళ్తే జాగ్రత్తగా వారికి అప్పగించాలని సూచించారు. ఆటో స్టాండ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సహకరించాలన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

తాళ్లపల్లి జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, దాత బాస కృష్ణ

షాబాద్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన బాస కృష్ణ రూ.1లక్షతో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. దాత కృష్ణతో కలిసి ఆయన ఫిల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కృషి చేసిన దాత బాస కృష్ణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంఘమేశ్వర్‌రెడ్డి, కిరణ్మయి, నాగిరెడ్డి, గ్లోరీ, శోభారాణి, మొగ్గులయ్య, బాలకృష్ణ, శీతాబాయి, లలీత, మంజుల, యూసుఫ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొందుర్గు: మండలంలోని ఆగిర్యాల సబ్‌స్టేషన్, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని ఎదిర సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

దోమల జోరు.. పల్లెలు బేజారు

సక్రమంగా సాగని ఫాగింగ్
- కొన్ని పంచాయతీల్లో యంత్రాలు కరువు
- దోమల బెడదతో అనారోగ్యాలకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఇళ్లమధ్యన ఖాళీ స్థలంలో పెరిగిన గడ్డి, చెట్లు



ఖాళీస్థలాల్లో నిలిచిన నీరు(ఫైల్)

కొత్తూరు: గత కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు గ్రామాలు, పట్టణాల్లోని రోడ్లు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉంటున్నాయి. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద పెరుగుతోంది. వాటి నియంత్రణకు గ్రామాల్లో సక్రమంగా ఫాగింగ్ చేపట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. మండలంలో 12 పంచాయతీలు, 08 అనుబంధ గ్రామాలు ఉండగా.. కొన్ని గ్రామ పంచాయతీలకు ఇప్పటికీ ఫాగింగ్ యంత్రాలు లేకపోవడం.. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిదర్శనంగా నిలుస్తోంది.

సక్రమంగా సాగని ఫాగింగ్..

వర్షాకాలం వ్యాధుల కాలం అయినందునా ప్రతిరోజు గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టాలి. కానీ మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇప్పటికీ ఏడు గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో లేవు. యంత్రాలు ఉన్న గ్రామాల్లో సైతం పలు కారణాలతో అరకొరగా ఫాగింగ్ చేపడుతున్నారు. దానికి తోడు ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని అంతర్గతరోడ్లు, ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. కనీసం అధికారులు ఇళ్ల మధ్యన ఉన్న ఖాళీ స్థలాల్లో పెరిగిన గడ్డిని సైతం తొలగించడం లేదు. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. దీంతో ప్రజలు తరచూ సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

ఖర్చులతో బేజారు..

దోమల నియంత్రణకు ఫాగింగ్ చేసే యంత్రాల్లో నింపే రసాయనాల కొనుగోలు అధికారులకు బేజారుగా మారింది. పలు పంచాయతీల్లో సరైన నిధులు లేక సిబ్బందికి వేతనాలు సర్దుబాటు చేయడమే కష్టంగా మారింది. ఇదే సమయంలో ఫాగింగ్ కోసం అదనంగా ఖర్చు చేయడానికి ప్రస్తుతం సర్పంచ్‌లు లేరు. ఒక్కసారి ఫాగింగ్ చేపట్టడానికి ఇంధనం, రసాయనాలకు సుమారు రెండు, మూడు వేల వరకు ఖర్చు అవుతుంది. నిధులు లేక పలు గ్రామాల్లో నెలలో ఒకటి, రెండుసార్లు ఫాగింగ్ చేపడుతున్నారు.

ఫాగింగ్ చేపడుతున్నాం..



ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్న గ్రామాల్లో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేపడుతున్నాం. ఇప్పటికీ మండలంలోని పలు పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు లేవు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

– విజయలక్ష్మి, ఎంపీఓ, కొత్తూరు.

రైతులకు అందుబాటులో యూరియా

మండల వ్యవసాయాధికారి చైతన్య



ఆగ్రోమార్ట్‌లో యూరియా కోసం డబ్బులు చెల్లిస్తున్న రైతులు

శంకర్‌పల్లి: పట్టణ, మండలంలోని రైతులకు యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి చైతన్య అన్నారు. సోమవారం పట్టణంలోని రైతు ఆగ్రోమార్ట్‌లో రైతులకు యూరియా పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. మండలానికి సంబంధించి ఇప్పటివరకు 50.94 మెట్రిక్ టన్నుల యూరియా డీలర్ల వద్దకు వచ్చిందని, దానికి సోమవారం నుంచి పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా అందిస్తున్నామన్నారు. వచ్చేవారం రోజుల్లో మరింత యూరియా వచ్చే అవకాశం ఉందని, రైతులు అవసరానికి అనుగుణంగానే యూరియా తీసుకెళ్లాలని సూచించారు.

డీజేలకు అనుమతులు లేవు

సీఐ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని సీఐ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ బన్సీలాల్ ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరై మాట్లాడుతూ.. వినాయక మండపాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపం ఏర్పాటుకు నిర్వాహకులు అన్ని శాఖల అధికారులతో తప్పనిసరిగా అనుమతులను తీసుకోవాలని, ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సంఘటనలు జరిగితే కార్యదర్శులు వెంటనే పోలీసు శాఖకు సమాచారం అందించాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. నాయకులు, యువజన సంఘాల నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనానికి కార్యదర్శులు పంచాయతీ పరిధిలోని చెరువులు, కుంటలను గుర్తించాలని, కావాల్సిన ఏర్పాట్లను చేపట్టాలన్నారు. చెరువుల వద్ద బారికేడ్లను, క్రేన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ జయంత్‌రెడ్డి, ఎస్‌ఐలు రాంచందర్, ప్రణయ్, శ్రీకాంత్, ట్రాన్స్‌కో ఏఈ వినోద్, మిషన్ భగీరథ ఏఈ ప్రీతి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం

కొందుర్గు: మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ సూచించారు. కొందుర్గు జీఎం పటేల్ ఫిల్లింగ్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన గణపతులను నీటిలో వేయడంతో నీటితో పాటు వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఇందుకుగాను ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, సచిన్, సంజీవ, హేమంత్, బద్రీ, నవీన్, మహేశ్, అశోక్, యాదయ్య పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తాంకర్ శివాజీ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మచారి, గణేశ్, నక్కా గోపాల్, ప్రవీణ్‌రెడ్డి, యాదయ్య, మహేశ్, శ్రీకాంత్‌రెడ్డి, అంజనేయులు, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

షాబాద్: మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు తప్పకుండా మట్టి గణపతినే పూజించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, ఇతర రసాయనాలతో తయారుచేసిన వినాయకుడి ప్రతిమలతో జల, భూమి కాలుష్యాలు ఏర్పడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని కోరారు. కార్యక్రమంలో షాబాద్ మాజీ సర్పంచ్ తమ్మలి రవీందర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సత్యనారాయణ, లయన్స్ క్లబ్ సభ్యులు మల్లికార్జున్, శ్రీకర్, ప్రదీప్, రాము, యాదగిరి, వెంకటయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



షాబాద్‌లో..



కొందుర్గులో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్



కేశంపేట: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

కొందుర్గు: రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నట్లు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ వ్యవసాయాధికారులు సురేష్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పనిముట్లు కేజీవీల్స్, రోటోవేటర్స్, ట్రాక్టర్ విత్తనాలు ఎరువులు వేసుకునేందుకు వీలైన యంత్రాలు అందుబాటులో ఉన్నాయని వారు పేర్కొన్నారు. చిన్న, సన్నకారు, మహిళా, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీపై పనిముట్లు సరఫరా చేస్తామని, అవసరమైన రైతులు దరకాస్తుతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, పాస్ ఫొటో జతచేసి సంబంధిత ఏఈఓలకు ఇవ్వాలని సూచించారు. ట్రాక్టర్‌తో నడిచే పనిముట్లకు ట్రాక్టర్ ఆర్‌సీ జతచేయాలని తెలిపారు.

విద్యుత్ స్తంభాలకు కేబుల్, ఇంటర్నెట్ వైర్ల తొలగింపు

షాద్‌నగర్: పట్టణంలోని విద్యుత్ స్తంభాలకు అమర్చిన కేబుల్, ఇంటర్నెట్ వైర్లను ట్రాన్స్‌కో అధికారులు సోమవారం తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్తంభాలకు అమర్చిన వైర్లను తొలగించామని ట్రాన్స్‌కో డీఈ శ్యాం సుందర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని వైర్లను తొలగించారు. పట్టణంలోని అనేక స్తంభాలకు ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా వైర్లను బిగించారని, విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు మరమ్మతులు చేపట్టాలంటే సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు పట్టణంలోని అన్ని విద్యుత్ స్తంభాలకు కేబుల్, ఇంటర్నెట్ వైర్లను తొలగించామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మొయినాబాద్: సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి అన్నపూర్ణ అన్నారు. మున్సిపాలిటీలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పులతో చాలా మందికి వైరల్ జ్వరాలు వస్తున్నాయన్నారు. వైద్య సిబ్బంది దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి.. అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి రోజు జ్వర పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో సీహెచ్‌ఓ వెంకట్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం అందించాలని వినతి

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ రహదారి అభివృద్ధిలో భాగంగా చేవెళ్లలో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు విస్తరణలో ఓ వెంచర్‌లో ప్లాట్లు కోల్పోతున్న వారికి పరిహారం చెల్లించి న్యాయం చేయాలని బాధితులు కోరారు. చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితులు ఏఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లలో సర్వే నంబర్లు 89, 90లలో 2016లో లక్ష్మీనగర్ పేరుతో వెంచర్ చేయగా.. తాము అందులో ప్లాట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ వెంచర్‌లో నుంచి 2018లో బీజాపూర్ రహదారి విస్తరణకు నోటిఫికేషన్ జారీ చేశారని, తాము కొనుగోలు చేసిన ప్లాట్లు బైపాస్ రహదారి విస్తరణకు సేకరించిన రోడ్డులో కోల్పోతున్నామని తెలిపారు. తమ ప్లాట్లకు ఇప్పటివరకు పరిహారం అందలేదని వాపోయారు. ఎనిమిదేళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నట్లు బాధితులు ఆరోపించారు. ప్రభుత్వం ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించి తమకు న్యాయం చేయాలని కోరారు. అధికారులు, ప్రభుత్వం తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో బాధితులు బూపాల్‌రెడ్డి, బస్వరాజ్, సందీప్‌కుమార్, వేణు, సదుర్శన్‌రెడ్డి, శివకుమార్, రాజేందర్‌రెడ్డి, గోవర్దన్, సుదర్శన్‌రెడ్డి, ప్రథాప్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కోడ్‌కు ముందే అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొత్తూరు: జేపీదర్గా రోడ్డులో నిర్మిస్తున్న కల్వర్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ రాకముందే మున్సిపాలిటీలో ఇప్పటికే గుర్తించిన అభివృద్ధి పనులను ప్రారంభించడానికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఇందులో భాగంగా పట్టణంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు సాయం చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటానని వివరించారు. ఇప్పటికే హెచ్‌ఆర్‌డీసీ నిధులతో జేపీదర్గా, కుమ్మరిగూడ రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రోడ్ల విస్తరణలో వ్యాపారులు, ప్రజలు అధికారులకు సహకారం అందించాలన్నారు. పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటుకు అద్దె భవనం, లేక ఖాళీ స్థలాన్ని పరిశీలించాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి సూచనలు ఇచ్చారు. మండలాల విభజనలో భాగంగా కొత్తూరులో కొత్తగా పీఏసీఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులకు రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, నాయకులు దేవేందర్‌ముదిరాజ్, జనార్ధన్‌చారి, కర్రొల్ల సురేందర్, నర్సింహ, దేవేందర్‌యాదవ్, శ్రీను, సత్తయ్య, జగన్, భార్గవ్‌గౌడ్, జంగ నర్సింహ, చంద్రపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

షాద్‌నగర్‌రూరల్: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే క్రికెట్, చదరంగం, వాలీబాల్ క్రీడా సామగ్రి కోసం క్రీడాకారులకు రూ.2లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటుగా మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడలకు కావాల్సిన సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్, నాయకులు ఎండీ.ఇబ్రహీం, జమ్రుద్‌ఖాన్, అందె మోహన్, జాంగారి రవి, ఖదీర్, అశోక్ పాల్గొన్నారు.

సీఐని కలిసిన ఆటో యూనియన్ నాయకులు



సీఐ భూపాల్‌శ్రీధర్‌ను సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల: ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని ఆటో కార్మికులకు సీఐ భూపాల్‌శ్రీధర్ సూచించారు. సోమవారం మండలంలోని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న ఆటో యూనియన్ సభ్యులందరూ సీఐని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఆటోలు నడిపించుకొని ఉపాధి పొందాలని సీఐ వారికి సూచించారు. కార్యక్రమంలో మండల ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, నవాజ్, కోశాధికారి శ్రీశైలం, ఉపాధ్యక్షులు మహేందర్, వెంకట్, రాములు, సమద్, సభ్యులు రాములు, ఆసిఫ్, హుస్సేన్, రాములు, వెంకటేశ్, అంజయ్య, రత్నయ్య, కిష్టయ్య, మాణిక్యం, తదితరులు ఉన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్



చేవెళ్లలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

చేవెళ్ల: రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పట్టించుకోకుండా విద్యావ్యవస్థను ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ అన్నారు. చేవెళ్లలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవటంతో పేద విద్యార్థులు ఎంతో మంది నష్టపోతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, వెంటనే ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు, పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి హారిక, సభ్యులు వివేకానందారెడ్డి, హరికృష్ణ, మనిదీప్, ఆకాశ్ ఉన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

మొయినాబాద్: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ మొయినాబాద్ నగర కార్యదర్శి వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మొయినాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, సమయానికి డబ్బులు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని.. లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సంజయ్, పల్లవి, రమేశ్, నవాజ్, సంజయ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

షాద్‌నగర్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కమల అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది సహకారంతో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకునే జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అగ్ని మండడానికి మండే స్వభావం కలిగిన వస్తువులు, ఉష్ణం, ఆక్సిజన్ అనే మూడు వస్తువులు దోహదం చేస్తాయన్నారు. ఇళ్లలో వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్లలో మీథేన్ ద్రవరూపంలో ఉంటుందని, అది వాతావరణంలోకి విడుదలైనప్పుడు ఆక్సిజన్‌తో కలిసి వాయురూపంలోకి మారుతుందన్నారు. కూలింగ్, స్టార్వేషన్, స్మాథరింగ్ అనే మూడు పద్ధతుల్లో అగ్ని ప్రమాదాల నుంచి రక్షించుకోవచ్చన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101, 112కు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవిప్రసాద్, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షకు తరలిన నాయకులు



షాబాద్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన నాయకులు

షాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం సత్యాగ్రహ దీక్షకు బీసీ సేన మద్దతు తెలిపినట్లు బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పేర్కొన్నారు. సోమవారం బీసీలకు రిజర్వేషన్లు సాధించాలనే ధ్యేయంతో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు విస్తృత మద్దతుగా షాబాద్ నుంచి 150 వాహనాలలో బయలుదేరారు. ఈ సందర్భంగా నాగర్‌గూడలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనతంరం ర్యాలీగా బయలుదేరారు. కార్యక్రమంలో బీసీసేన నాయకులు ఉన్నారు.

షాద్‌నగర్ నుంచి..

షాద్‌నగర్‌రూరల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లను సాధించాలనే లక్ష్యంతో ఆర్.కృష్ణయ్య ఇందిరాపార్కు వద్ద చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా సోమవారం బీసీసేన నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ర్యాలీని బీసీ సేన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.